నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 | NAGARKURNOOL


మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 20 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలం బీరెల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుబ్బ బీసన్న విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. దీంతో పార్టీ ఆధ్వర్యంలో ప్రమాద బీమా కింద రూ.2లక్షల చెక్కు మంజూరు కాగా మృతుడి భార్య బాలమ్మకు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందు చూపుతో కార్యకర్తలకు ఏదైనా ఆపద సంభవిస్తే కుటుంబం రోడ్డున పడకూడదనే మంచి ఆలోచనతో కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించారని చెప్పారు. దీని స్ఫూర్తితోనే రైతుబీమా, చేనేత బీమా తదితర సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రవేశపెట్టి ఆ కుటుంబాలకు చేయూత ఇచ్చినట్లు గుర్తుచేశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌నాయుడు, బీచుపల్లి, రాజు ఉన్నారు.

కార్యకర్త మృతికి సంతాపం..

మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ లక్ష్మి భర్త నర్సింహులు గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నర్సింహులు మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ కేశవ్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, చిత్రంలో ఎమ్మెల్యే

పీఎం ఉషాతో విద్యా ప్రమాణాలు మెరుగు

- పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్
- వర్చువల్ విధానంలో పథకాన్ని ప్రారంభించిన పీఎం మోదీ
- హాజరైన మహబూబ్‌నగర్ ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

పాలమూరు, ఫిబ్రవరి 20 : పీఎం ఉషా (ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్) పథకం విద్యార్థులకు వరమని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని పీయూలో (పీఎం ఉషా) పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ పీఎం ఉషా ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలకు నిధులను సమకూర్చి ఉన్నత విద్య, అభ్యాస విధానాన్ని మెరుగుపర్చడం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మల్టీడిసిప్లినరీ ద్వారా ఉపాధి పెంచేందుకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలో ఇలాంటి పథకాలతో విద్యార్థులకు ఉన్నత విద్య అందుతుందన్నారు. దేశవ్యాప్తంగా 1,114 విశ్వవిద్యాలయాలు పథకానికి దరఖాస్తు చేసుకోగా, 25 విశ్వవిద్యాలయాలకు రూ.100కోట్ల నిధులకు ఎంపికయ్యాయన్నారు. ఇందులో పాలమూరు యూనివర్సిటీ ఉండడం అభినందనీయమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10కోట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంజూరు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అర్ధాకలి

- కుళ్లిన గుడ్లు పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్
- లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం
- ఆకలితో అలమటిస్తున్న చిన్నారులు

మహ్మదాబాద్, ఫిబ్రవరి 20 : చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పౌష్టికాహారం అందడం లేదు. చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం కేంద్రాల్లో గుడ్లు, పాలు అందించాల్సి ఉంది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా కుళ్లిపోయిన గుడ్లను సరఫరా చేస్తుండడంతో వాటిని తినలేక లబ్ధిదారులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉమ్మడి గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో మూడు అంగన్‌వాడీ సెక్టార్లు ఉండగా, గండీడ్ 14, నంచర్ల 14, మహ్మదాబాద్‌కు 28 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిద్వారా ప్రతి రోజూ చిన్నారులకు విద్యను అందించడంతోపాటు పౌష్టికాహారం ఇవ్వాలి. ఈనెల 8వ తేదీ నుంచి మండలంలోని పలు కేంద్రాలకు గుడ్లు రాగా నాణ్యత లేకుండా, ఉడకబెట్టగా, పగిలిపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. 90శాతం గుడ్లు ఇలానే పాడైపోయినవి ఉండడంతో చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్లు ఉన్నతాధికారులకు చెప్పినా ఎలాంటి ఫలితం లేదని చెబుతున్నారు. నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుళ్లిపోయిన కోడిగుడ్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని గుడ్లు పంపిణీ చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. గతంలో ఇలాగే జరిగితే కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులకు చెప్పాం. రెండు నెలలు బాగానే పంపిణీ చేశారు. మళ్లీ బాగాలేని గుడ్లు సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అంగన్‌వాడీ టీచర్లు గుడ్లు వచ్చినప్పుడు ఒకటి, రెండు పగులగొట్టి చూడాలి. బాగాలేవని తెలిస్తే వాటిని తిరిగి పంపించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వరి, సీడీపీవో

యాత్రలు తుస్సు!

- పాలమూరులో హీటెక్కిస్తున్న పొలిటికల్ టూర్స్
- జనాదరణకు కొత్తకొత్త జిమ్మిక్కులు
- ప్యాకేజీ స్టార్లు ఓ వైపు.. జననేతలు మరోవైపు.. అంటూ విస్తృత ప్రచారం
- తేలిపోయిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర
- ఇద్దరు కేంద్ర మంత్రులు వచ్చినా స్పందన కరువు
- కాంగ్రెస్‌లో ముదురుతున్న టికెట్ల వ్యవహారం
- వంశీ న్యాయయాత్రకు సీఎం రేవంత్ ఎర్రజెండా
- జనం సమస్యలు గాలికి వదిలేశారంటూ ఇరు పార్టీలపై బీఆర్ఎస్ నేతల విసుర్లు



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో పాలమూరులో పొలిటికల్ హీట్ రోజురోజుకూ పెరుగుతున్నది. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలు చేపడుతున్న యాత్రలు ఆ పార్టీల్లో కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్దలను సంప్రదించకుండా యాత్రలు చేపడుతుండడంతో లోలోపలే లుకలుకలు మొదలయ్యాయి. యాత్రకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఏకంగా సీఎం సోదరుడే రంగంలోకి దిగడంతో ఆ పార్టీ నేతలు షాక్‌కు గురయ్యారు. చివరకు యూటర్న్ తీసుకున్నారు. పార్లమెంట్ టికెట్ ఆశించి పార్టీలో చేరిన మరో నేత పోటాపోటీగా ఫ్లెక్సీలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర తొలిరోజే తుస్సుమన్నది. ఇద్దరు కేంద్ర మంత్రులు, అరడజను రాష్ట్ర నాయకులు వచ్చినా కార్యకర్తల నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో ఆ పార్టీ కేంద్ర మంత్రి ఒకరు మధ్యలోనే వెళ్లిపోయారు. కార్యకర్తలు లేక సంకల్పయాత్ర వెలవెలబోయింది. రాష్ట్రంలో అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను గాలికొదిలేసి యాత్రలు చేపట్టడం ఏమిటని బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. ఇటు బీజేపీ కూడా సమస్యలపై నిలదీసేదిపోయి అధికార పార్టీకి వత్తాసు పలుకుతుందని దుయ్యబడుతున్నారు. యాత్రలకు ఇటు కార్యకర్తలనుంచి అటు ప్రజల నుంచి స్పందన కరువవడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు కంగుతింటున్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు పార్టీలు చేస్తున్న జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ న్యాయయాత్రకు చెక్..

కాంగ్రెస్ పార్టీ నుంచి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర ఆ పార్టీలో విబేధాలను సృష్టిస్తున్నది. పార్టీ పెద్దలను సంప్రదించకుండా ఏకపక్షంగా న్యాయ యాత్రను జనవరి 31న నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. యాత్ర ప్రారంభమయ్యాక పార్టీలోని నేతలు ఒక్కొక్కరు తమ అసంతృప్తి గళాన్ని వినిపించారు. హైటెక్ హంగులతో చేపట్టిన యాత్రకు ఆయన భారీ పబ్లిసిటీ ఇచ్చుకున్నారు. పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యేల ఫొటోలు పెట్టి భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టి ప్రచారం చేపట్టారు. దీంతో కంగుతిన్న కాంగ్రెస్‌లోని మరో వర్గం ఏకంగా సీఎం సోదరుడిని రంగంలోకి దింపింది. దీంతో తిరుపతన్న మిత్ర మండలి పేరుతో రాత్రికిరాత్రే ఫ్లెక్సీలు వెలిశాయి. అనంతరం నాలుగైదు గంటల్లో మున్సిపల్ అధికారులతో తీయించేశారు. తిరుపతిరెడ్డి ఫ్లెక్సీలు వెలియడంతో వంశీచంద్‌రెడ్డి యాత్రకు బ్రేక్ ఇచ్చి పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసి పనిచేస్తామని ప్రకటించే వరకు వెళ్లింది. ఈ వివాదం జరుగుతుండగానే జిల్లాకు చెందిన పార్లమెంటరీ ఒకరు చార్టెడ్ ఫ్లైట్‌లో 40, 50 మంది నాయకులను వెంటేసుకుని ఢిల్లీలో హడావుడిగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఇక పార్లమెంట్ టికెట్ తనదేనంటూ ప్రచారం ప్రారంభించారు. దీంతో కంగుతిన్న వంశీచంద్ యాత్రకు రాష్ట్ర పెద్దలను ఆహ్వానించే వరకు వెళ్లింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో వంశీయాత్రపై సీఎం ఆగ్రహమై తన అనుమతి లేకుండా ఎలాంటి యాత్రలు చేపట్టరాదని నేతలకు వార్నింగ్ ఇచ్చారు. దీంతో యాత్రకు బ్రేక్‌పడేలా ఉన్నది. ఇప్పటికే ఎంపీ టికెట్ కోసం వంశీచంద్‌రెడ్డి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, నవాబుపేట మండలం గురుకుంటకు చెందిన మన్నె జీవన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

తుస్సుమన్న బీజేపీ విజయ సంకల్పయాత్ర..

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ విజయ సంకల్పయాత్ర పేరిట జనం ముందుకు వచ్చి షో చేస్తున్నది. ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విజయ సంకల్పయాత్రకు తొలిరోజే షాక్ తగిలింది. అనుకున్న స్థాయిలో కార్యకర్తలను తరలించడంలో ఆ పార్టీ నేతలు విఫలమయ్యారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో రచ్చ జరుగుతున్నది. డీకే అరుణ పెత్తనం చలాయిస్తుండడంతో జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి అనుచరుడు జలంధర్‌రెడ్డి సైలెంట్ అయిపోయారు. దీంతో జనాన్ని తరలించడంతో డీకే అరుణవర్గం అట్టర్ ఫ్లాప్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు కేంద్ర మంత్రులు వచ్చినా.. మక్తల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ తుస్సుమనడంతో ఒక కేంద్ర మంత్రి తన షెడ్యూల్‌ను మార్చుకొని ఢిల్లీకి జంప్ అయ్యారు. యాత్రకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పార్టీ నేతలపై తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇలా అయితే పార్లమెంట్ స్థానం ఎలా కైవసం చేసుకుంటామని క్లాస్ తీసుకున్నారు.

ప్రజాసమస్యలను గాలికొదిలేసి యాత్రలా..?

ప్రజలు కరెంట్, తాగునీరు, పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ నేతలు యాత్రల పేరిట కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ మండిపడుతున్నది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించి కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరును ఎడారిగా మార్చిందని, నీళ్లు లేక ప్రాజెక్టులు ఒట్టిపోయి పంటలు ఎండిపోతుంటే బీజేపీ, కాంగ్రెస్ యాత్రలు చేయడం సిగ్గుచేటని గులాబీ నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే రైతుబంధు రాక రైతులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి అప్పులు తెచ్చుకుంటున్నారని విమర్శిస్తున్నారు. వంద రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఒక్క గ్యారెంటీ అమలు చేసి ఆటోడ్రైవర్లను రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఇకనైనా కాంగ్రెస్, బీజేపీ నేతలు యాత్రలు నిలిపివేసి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలుపై బీజేపీ పట్టించుకోకుండా ఆ పార్టీకి వత్తాసు పలుకడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

జములమ్మ.. జనసంద్రం


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

- బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తులు
- సారెతో ఎద్దులబండిపై గుర్రంగడ్డకు అమ్మవారి పయనం

గద్వాల రూరల్, ఫిబ్రవరి 20 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయం మంగళవారం భక్తులతో జనసంద్రంగా మారింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కాగా, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని సంప్రదాయబద్ధంగా ఎద్దుల బండిపై మెట్టినింటికి తీసుకొస్తారు. మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేకంగా ఎద్దులబండిపై సారెను తీసుకుని అమ్మవారి పుట్టినిళ్లు గుర్రంగడ్డకు భాజాభజంత్రీలతో సాగనంపారు. అక్కడి నుంచి జమ్మిచే డు, లత్తీపురం, బీరెల్లీ మీదుగా గుర్రంగడ్డకు చేరుకుంటుంది. ప్రత్యేక పూజల అనంతరం మరుసటి రోజు (బుధవారం) తెల్లవారుజామున జమ్మిచేడుకు తీసుకొస్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్‌కుమార్, సతీశ్, పాలక మండలి సభ్యులు కాంబ్లే, జానకీరాములు, శంకర్, రాము, సిబ్బంది మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రవిప్రకాశ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో సిడె ఊరేగింపు

అమ్మా బైలెల్లినాదో..

- వైభవంగా ఈదమ్మ ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా సిడె వేడుకలు
- బోనాలతో మహిళల ఊరేగింపు

కొల్లాపూర్, ఫిబ్రవరి 20 : భక్తుల కొంగుబంగారమైన ఆది పరాశక్తి కొల్లాపూర్ ఈదమ్మ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. తప్పెట్ల దరువుల మధ్య సిడె కదిలింది. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. పూజారి కురుమయ్య పొడువైన కర్ర, చివరన గొర్రెనుకట్టి మధ్యలో భక్తులపై బండారు (పసుపు, కుంకుమ) చల్లుతూ గుడి చుట్టూ తిప్పారు. సిడెను తాకితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. దీంతో సిడెను తాకేందుకు పోటీపడ్డారు. ఉమ్మడి జిల్లాతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతాలైన కర్నూల్, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈదమ్మ తల్లీ దీవించమ్మా అంటూ వేడుకున్నారు. బోనంకుండలో నైవేద్యాన్ని ఉంచి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఈదమ్మతల్లిని దర్శించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చేపల పెంపకంలో నీళ్లు కీలకం

పెబ్బేరు, ఫిబ్రవరి 20 : చేపల పెంపకంలో నీటి నాణ్యత ఎంతో కీలకమకని, మంచినీటిలో మిశ్రమ జాతుల చేపల పెంపకం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని పెబ్బేరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డి. నాగలక్ష్మి అన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సౌజన్యంతో మత్స్య రైతులకు కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి చేపల పెంపకంలో నీటి నాణ్యత నిర్వహణ ముఖ్యమన్నారు. నీటి నాణ్యత, ప్రమాణాలపై రైతులకు అవగాహన ఉంటే చెరువులను కాలుష్యం బారి నుంచి కాపాడుకోవడమే కాకుండా మంచి లాభాలు పొందవచ్చన్నారు. మత్స్య కళాశాలలో వ్యాధుల నిర్ధారణ కేంద్రం, నీటి నాణ్యత విశ్లేషణ ల్యాబొరేటరీ ఏర్పాటు చేశామని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మాధవి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ భానుప్రకాశ్, అధ్యాపకులు ఉన్నారు.

రేకులపల్లిలో విద్యార్థులకు అస్వస్థత

- మధ్యాహ్న భోజనం తిని 13 మందికి ఫుడ్ పాయిజన్
- జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలింపు

గద్వాల, ఫిబ్రవరి 20 : ఫుడ్ పాయిజన్‌తో 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గద్వాల మండలంలోని రేకులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చోటుచేసుకున్నది. పాఠశాలలో మధ్యాహ్నం అన్నంతోపాటు టమాట కూర వడ్డించారు. భోజనం తిన్న తరువాత విద్యార్థులు ఆనందమణి, చరణ్, శివ, రాకేశ్, హరీశ్, వరుణ్, పర్వత కుమార్, క్రాంతి, తేజేశ్వరి, మానస, సునీత, మల్లిక, మల్లికార్జున్‌కు వాంతులు, తలనొప్పి, కడుపునొప్పి రావడంతో ఉపాధ్యాయులు గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి గంటపాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఆరోగ్యం కుదుటపడడంతో పంపించారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యురాలు సౌమ్య తెలిపారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి సురేశ్ దవాఖానకు చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. ఘటనపై వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.


కోటలోని ఆలయం

సంస్థానానికి సరికొత్త శోభ

- నేటి నుంచి గద్వాలలో చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు
- రేపు స్వామివారి కల్యాణోత్సవం
- 24న రథోత్సవం
- మంత్రాలయ మఠం ఆధ్వర్యంలో నిర్వహణ

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలోనే అతిపెద్ద సంస్థానంగా గద్వాల సంస్థానానికి ప్రత్యేకత ఉన్నది. ఇంతటి ప్రాచుర్యం పొందిన సంస్థాన ఇలవేల్పు భూలక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రతి రోజూ ప్రత్యేక వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యుద్దీపాలతో గద్వాలకోట సరికొత్త శోభను సంతరించుకున్నది.

మంత్రాలయ మఠం ఆధ్వర్యంలో ఉత్సవాలు..

మాఘశుద్ధ మాసంలో అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలను 16 ఏండ్లుగా మంత్రాలయ మఠం నిర్వహిస్తున్నది. పౌర్ణమి రోజు రథోత్సవం నిర్వహించి వేడుకలు ఆరంభిస్తారు. గద్వాల సంస్థానాధీశుల కాలంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు మరింత శోభాయమానంగా నిర్వహించేవారని చరిత్ర చెబుతున్నది. కవులు, కళాకారులను సత్కరించేవారు. పెద్ద తేరుపై భూలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి, సీతారాములు, వేణుగోపాలస్వామి వేర్వేరు తేర్లపై ఊరేగేవారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన బ్రహ్మోత్సవాల నిర్వహణను మంత్రాలయ పీఠానికి అప్పగించాక ఉత్సవాల్లో కొంత ప్రాధాన్యత తగ్గిందని భక్తులు చర్చించుకుంటున్నారు. కాగా, నెలపాటు నిర్వహించే ఉత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు నడిగడ్డ ప్రజలే కాకుండా పక్క రాష్ట్రాలైన ఆంధ్రా, కర్ణాటకకు చెందిన వేలాది మంది తరలివచ్చి ఉత్సవాలను తిలకించనున్నారు.

ఉత్సవాలు ఇలా..

ఏడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో మొదటి రోజు మూలవిరాట్‌కు నిత్య విశేష ఫలపంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, పుణ్యాహవాచనం, సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు హనుమత్ వాహనంపై స్వామి ఊరేగింపు ఉంటుంది. 22న కల్యాణోత్సవం, గరుడ వాహనంపై ఊరేగిస్తారు. శనివారం స్వామి వారి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సంకల్పం నెరవేరింది..

తిరుమల శ్రీవారికి సమర్పించే ఏరువాడ పంచెల మాదిరి గద్వాల కోటలో వెలసిన భూలక్ష్మీ చెన్నకేశవ స్వామికి మా చేనేత వస్త్రాలను అలంకరించాలన్న సంకల్పం నెరవేరింది. ఆ రేండ్ల కిందటే స్వామికి వస్త్రాలు సమర్పించాలని సమిష్టిగా నిర్ణయం తీసుకున్నాం. మాఘశుద్ధ పౌర్ణమి రోజు వైభవంగా నిర్వహించే ఉత్సవాల్లో స్వామి, అమ్మవారిని ఈ వస్త్రాలతో అలంకరిస్తాం. మొదటి సారి మా చేతుల మీదుగా సమర్పించడం సంతోషంగా ఉన్నది.

– అక్కల శాంతారం, చేనేత కళాకారుడు

నా జన్మ ధన్యమైంది..

నేను 40 ఏండ్లుగా చేనేత వృత్తిలో ఉన్నాను. ఎన్నో చీరలు నేచాను. కానీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి గద్వాల చేనేత పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో ఆనందంగా ఉన్నది. వస్త్రాల తయారీలో చేతనైన సేవను అందించడంతో నా జన్మధన్యమైంది.

– లక్ష్మీదేవి, చేనేత కళాకారురాలు

చెన్నకేశవుడికి ఏరువాడ పంచె

- గద్వాల సంస్థాన చరిత్రలో తొలిసారిగా బ్రహ్మోత్సవాలకు చేనేత వస్త్రాలు
- నిమగ్నమైన జరీ చీరల ఉత్పత్తి సంఘం
- మాఘశుద్ధ పౌర్ణమిన స్వామికి అలంకరణ

మగ్గంపై వస్త్రాన్ని నేస్తున్న కళాకారులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలోని భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అయితే తిరుమల శ్రీవారి ఉత్సవాల సందర్భంగా ఏరువాడ పంచెలను సంస్థానం కాలం నుంచి దాదాపు ఐదు దశాబ్దాలుగా అందిస్తూ చేనేత ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిన సంస్థానంగా నిలిచింది. అదే స్ఫూర్తితో సంస్థాన కాలం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శ్రీ భూలక్ష్మీచెన్నకేశవుడికి గద్వాల పట్టు పంచె.. అమ్మవారికి పట్టు చీరను బ్రహ్మోత్సవాల్లో సమర్పించేందుకు శ్రీకారం చుట్టింది జరీ చీరల ఉత్పత్తి సంఘం.. నియమ నిష